# మీ సొంత పట్టణంలోనే ఉద్యోగం

### ప్రత్యేక పోర్టల్, యాప్‌ను అభివృద్ధి చేస్తున్న కేంద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): కొవిడ్ సంక్షోభానంతరం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చిన 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం 'జాబ్ ఎట్ యువర్ హోమ్ టౌన్' పేరుతో ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను, మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఉద్యోగార్థులు లొకేషన్, సెక్టార్, ఎంప్లాయర్, పేస్కేల్, అవసరమైన నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలను ఫిల్టర్ చేసుకునేందుకు కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ అభివృద్ధి చేస్తున్నది. పీఎం గతిశక్తి పోర్టల్‌లో ఉద్యోగాల డాటాను మ్యాపింగ్ చేస్తున్నది. ఎంప్లాయర్స్‌ను, ఉద్యోగార్థులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే డిజిటల్ మార్కెట్ ప్లేస్‌లా నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్ పనిచేస్తుంది. ఇప్పటికే 41 లక్షల ఎంప్లాయర్స్, కోటికిపైగా ఉద్యోగార్థులు ఎన్‌సీఎస్‌లో నమోదయ్యారు. పీఎం గతిశక్తిని ఎన్‌సీఎస్ పోర్టల్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఉద్యోగావకాశాలను జియో-ట్యాగింగ్ చేస్తున్నారు. ఉద్యోగార్థులు తమకు 20-40 కి.మీ పరిధిలో ఉన్న ఉద్యోగావకాశాలను గుర్తించేలా ఓ ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. జమ్ముకశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలు ఇప్పటికే ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టాయి.

## మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

### • కొనుగోలు కేంద్రం కోసం రాస్తారోకో



*ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పెల్లి గ్రామంలోని ప్రధాన రోడ్డుపై రైతులు, ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం కుప్పలు పోసి 20 రోజులు దాటినా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం దారుణమని వాపోయారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి నష్టపోయే ప్రమాదం ఉన్నదని, ఇకనైనా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. –జన్నారం*

# ఫార్మా బాధిత రైతులపై కేసులు

- కోర్టు ఉత్తర్వులను పాటించాలన్నందుకు పోలీసుల దౌర్జన్యం
- తాటిపర్తి, మేడిపల్లి రైతులపై కేసు నమోదు

రంగారెడ్డి, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : ఫార్మా భూముల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా సర్వే చేపట్టేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులపై గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు కేసులు నమోదు చేశారు. కొన్ని రోజులుగా ఫార్మాసిటీ భూముల రీ సర్వేతో పాటు కంచె ఏర్పాటు పనులను టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు పోలీసుల నిర్బంధం మధ్య చేపడుతున్నారు. తాటిపర్తిలోని 114 సర్వే నంబర్‌లో సర్వేచేసి ఫెన్సింగ్ వేసేందుకు వచ్చిన అధికారులను కోర్టు స్టే ఉన్నందున సర్వే పనులు చేపట్టవద్దనందుకు సంగెం భిక్షపతి, సంగెం శ్రీనాథ్, సంగెం ఆండాళ్‌పై గ్రీన్‌ఫార్మా ఎస్సైతో స్టేట్‌మెంట్ తీసుకుని సుమోటోగా కేసు నమోదుచేశారు. మేడిపల్లికి చెందిన సర్వే నంబర్ 65లో కూడా సర్వేచేసి కంచె వేసేందుకు వచ్చిన అధికారులను ఆ భూమికి సంబంధించిన గడ్డం మహేశ్, గడ్డం సుందరయ్య అడ్డుకున్నారన్న అభియోగంపై వారిపై కూడా కేసులు నమోదుచేశారు. కోర్టు స్టే ఉన్నప్పటికి తమ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించటమే కాకుండా ప్రశ్నించిన తమపై కేసులు నమోదు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వెంటనే కేసులు ఉపసంహరించుకోవాలని కోరారు.

# అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

### సినీనటుడు ఆర్ నారాయణమూర్తి



దామరగిద్ద, ఏప్రిల్ 27 : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సినీనటుడు ఆర్ నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మల్‌రెడ్డిపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ నారాయణమూర్తి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలతోపాటు భారత పౌరులందరి కోసం రాజ్యాంగాన్ని రచించి వాటి ఫలాలు అందరికీ అందించడానికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం ఆటపాటలతో అలరించారు.

# బిజీగా ఉన్నా.. మరో తేదీ ఇవ్వండి

### ఈడీని కోరిన సినీనటుడు మహేశ్‌బాబు



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): సాయిసూర్య డెవలపర్స్, సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీల మనీ లాండరింగ్ కేసులో ప్రముఖ సినీనటుడు మహేశ్‌బాబు షూటింగ్ వల్ల సోమవారం విచారణకు హాజరు కాలేకపోతున్నానని, మరో తేదీని ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి ఆదివారం లేఖ రాశారు. దీనిపై ఈడీ స్పందించాల్సి ఉంది. మహేశ్‌బాబు సాయిసూర్య డెవలపర్స్ సంస్థకు ప్రచారకర్తగా ఉన్నారు. అందుకు రూ.5.9 కోట్ల చెల్లించినట్టు ఈడీ ఆధారాలు సేకరించింది. దీంతో మహేశ్‌బాబు తన పాన్‌కార్డ్, బ్యాంక్ అకౌంట్ల పాస్‌బుక్స్‌తో విచారణకు హాజరుకావాలని ఈడీ నోటీసులు ఇచ్చింది. రాజమౌళి దర్శకత్వంలో ఎస్ఎస్ఎంబీ29 సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో విచారణకు ఇప్పుడు రాలేనని మహేశ్ ఈడీకి విజ్ఞప్తి చేశారు. సాయిసూర్య డెవలపర్స్, భాగ్యనగర్ ప్రాపర్టీస్ సంస్థలు అక్రమ లావాదేవీలకు సంబంధించి 100 కోట్ల రూపాయలకు బాధితులను మోసం చేశాయని ఆరోపణలు ఉన్నాయి.

# ఇండియాపై హైదరాబాదీ అక్కసు

- ఇండియాను పాకిస్థాన్‌లో కలిపి 'న్యూ మ్యాప్ ఆఫ్ పాకిస్థాన్' పేరుతో ఇన్‌స్టాలో రీల్
- మధురానగర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు
- నిందితుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

వెంగళరావునగర్, ఏప్రిల్ 27 : పాకిస్థాన్ భూభాగంలో ఇండియా ఉన్నట్టుగా 'న్యూ మ్యాప్ ఆఫ్ పాకిస్థాన్' పేరుతో ఇన్‌స్టాలో రీల్ పోస్టు చేశాడు ఓ దేశద్రోహి. 'పోరా భాయ్.. ఏం చేసుకుంటావో చేసుకో'.. అంటూ బరితెగింపు మాటలు కోట్ చేశాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ పాతబస్తీలోని శాస్త్రిపురానికి చెందిన సయ్యద్ హమీద్(19) భారతదేశంపై దురుద్దేశపూర్వకంగా ఇండియా బోర్డర్ చుట్టూ గ్రీన్ కలర్ వేసి ఇన్‌స్టాలో రీల్ పోస్టు చేశాడు. @iamsyedahmed ఐడీ పేరుతో ఉన్న ఈ రీల్‌ను రహ్మత్‌నగర్‌కు చెందిన సాత్విక్‌సాగర్ చూసి హమీద్‌పై మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.



# డెర్మటోసర్జరీపై 'కిమ్స్'లో వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రోగులకు మెరుగైన ఫలితాలు అందించాలంటే వైద్యులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని కిమ్స్ దవాఖాన సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు సూచించారు. డెర్మటోసర్జరీపై ఆదివారం సికింద్రాబాద్‌లోని 'కిమ్స్' ప్రాంగణంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఏసీఎస్(ఐ) ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో శరీర గాయాలకు కుట్లువేసే టెక్నిక్‌లపై పలువురు డెర్మటాలజిస్టులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ కొణతం రాజ్యలక్ష్మి నేతృత్వంలో సాగిన ఈ వర్క్‌షాప్‌లో డాక్టర్ అంచల పార్థసారథి, డాక్టర్ ఏఎస్ కుమార్, డాక్టర్ నితిన్ జైన్, డాక్టర్ యోగేశ్ భింగ్రాడియా, డాక్టర్ నందిత, డాక్టర్ నితిన్ బార్డే, డాక్టర్ మానస్ రంజన్ పుకాన్, డాక్టర్ తేజస్విని సలుంకే, డాక్టర్ ఆనంద్ వగ్గు, డాక్టర్ గంప జ్యోత్స్న, డాక్టర్ రాకేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. భారత్, నేపాల్‌కు చెందిన 300 మందికిపైగా డెర్మటాలజిస్టులు ఈ వర్క్‌షాప్‌నకు హాజరయ్యారు.














